ఉంటామా.. ఊడుతామా?

జూన్ 4 రాజకీయ పార్టీల నేతల్లోనే కాదు.. అధికారుల్లోనూ టెన్షన్ నెలకొన్నది. మరో 15 రోజుల్లో వచ్చే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై రాజకీయ నాయకుల్లో టెన్షన్ నెలకొనగా.. ఫలితాలు ముగిసిన తర్వాత ఉంటామా.? ఊడుతామా.? అనే టెన్షన్ అధికారుల్లో నెలకొన్నది. ఎన్నికల కోడ్ ముగిస్తే రాజకీయ జోక్యం పెరిగే అవకాశాలు ఉంటాయని, ఆలోపే అన్ని చక్కబెట్టుకోవాలనే ధోరణిలో అధికారులు దూకుడు పెంచారు.

- అధికారుల్లో టెన్షన్ పుట్టిస్తున్న జూన్ 4
- ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ జోక్యం పెరిగే అవకాశం
- ఆలోపే వ్యవహారాలు చక్కబెట్టుకునే పనిలో అధికారులు
- ఎక్కడ చూసినా.. బదిలీలు తప్పవనే చర్చ

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ) :ఇంకో పదిహేను రోజుల్లో ఇక్కడ ఉంటామా? మారిపోతామా? ఉన్నప్పుడే అన్ని పనులు చక్కబెట్టుకోవాలనే ధోరణితో కొందరు పోలీసులు జూన్ 4వ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొంత మంది ఐపీఎస్, డీఎస్పీలతో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, కానిస్టేబుల్స్‌ను బదిలీ చేశారు. ఇందులో భాగంగానే ట్రై పోలీస్ కమిషనరేట్లకు కొత్త బాస్‌లు వచ్చారు. ఇంతలోనే పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాచకొండ కమిషనర్‌తో పాటు హైదరాబాద్‌లో కొందరు అదనపు పోలీస్ కమిషనర్లు ఎన్నికల నియమావళిలో భాగంగా బదిలీ చేశారు. రాచకొండ కమిషనర్ మినహా హైదరాబాద్‌లో ఖాళీ అయిన పోస్టులలో కొత్తవారిని నియమించలేదు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడిన మరుసటి రోజు ఎన్నికల కోడ్ ముగుస్తుంది. అధికార పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యుల సూచనలు, ఎమ్మెల్యేల సూచనలతో కొత్త అధికారులు చాలా చోట్ల బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఎవరు ఎక్కడ ఎన్నిరోజులు ఉంటారనే విషయంలో ఇప్పుడు అధికారులకు స్పష్టత లేదు. దీంతో కొందరు అధికారులు తమ దృష్టికి వచ్చిన కేసులు, ఇప్పటికే ఒప్పందాలు చేసకున్న కేసులను త్వరగా ముగించుకొని అందులో ఏమైనా ఆర్థిక వ్యవహారాలు ఉంటే సర్దుబాటు చేసుకొని బదిలీలకు సిద్ధంగా ఉండాలని చూస్తున్నారు.

కమిషనర్లపై ఒత్తిళ్లు తెచ్చే అవకాశం

ఈ ఆరు నెలల సమయంలో ట్రై పోలీస్ కమిషనరేట్లలో పనిచేసే సీఐలు, ఎస్సైలపై వివిధ ఆరోపణలు రావడంతో బదిలీ, సస్పెన్షన్ వేటు పడ్డాయి. మరికొందరు ఏసీబీకి కూడా పట్టుబడ్డారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లలో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా చాలా మందికి ఇన్‌స్పెక్టర్ స్థాయి పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే జూన్ 4వ తేదీ తరువాత స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు పెరిగే అవకాశాలు ఉన్నాయి. తమకు కావాల్సిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలని కమిషనర్లపై ఒత్తిళ్లు తెచ్చేందుకు అవకాశం ఉందనే టాక్ పోలీస్ వర్గాలలో నడుస్తున్నది. ఈ క్రమంలోనే పోస్టింగ్ ఉంటుందా? లేదా? అని కొందరు అధికారులలో సందిగ్ధత నెలకొన్నది. నిజాయితీ, ప్రతిభ ఆధారంగా పోలీస్ కమిషనర్లు కొంత మంది అధికారులను బదిలీ చేసేందుకు ససేమిరా అనే అవకాశాలు ఉన్నాయి. అలాంటి అధికారులు పూర్తి ధీమాతో ఉన్నారు. ఊహించని విధంగా మంచి ఠాణాలకు ఎస్‌హెచ్‌ఓలుగా పోస్టింగ్‌లు రావడం, దీపం ఉన్నప్పుడు చక్కబెట్టుకోవాలనే ధోరణితో ఉండే వారు కొందరుంటారు. అలాంటి వారు మాత్రం జూన్ 4వ తేదీ లోపు ఏమైనా ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలుంటే త్వరగా పూర్తి చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఇదిలాఉండగా ఉన్నతాధికారుల్లోనూ కొందరు మారే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. జూన్ 4వ తేదీ తరువాత ఎంత మంది అధికారులు బదిలీ అవుతారు, ఎంత మంది అదే పోస్టులలో ఉంటారనే విషయంపై స్పష్టత వస్తుంది.

న్యూడెమోక్రసీ నాయకులను కోర్టులో హాజరు పర్చాలి

- గ్రామాలలో పోలీసు కూంబింగ్‌ను వెంటనే ఆపాలి
- న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ

అంబర్‌పేట, మే 19 : వరంగల్ పోలీసులు ఈ నెల 18న రాత్రి అరెస్టు చేసిన సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీకి చెందిన నలుగురు అజ్ఞాత దళ నాయకులను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, వరంగల్ జిల్లా నాయకులు సున్నా అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకటరెడ్డి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ, ఐఎఫ్‌టీయూ వరంగల్ జిల్లా నాయకులు జెన్నారం రాజేందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ సరిహద్దులోని హసన్‌పర్తి మండలం, అరేపల్లి గ్రామ సమీపంలో ముందస్తు సమాచారంతో పోలీసులు మాటువేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. న్యూడెమోక్రసీ నాయకులు అబర్ల రాజన్న, సిద్ధబోయిన జీవన్, దేవిరెడ్డితో పాటు మరొకరు ఉన్నారని, ఈ వాస్తవాన్ని బయటకు తెలుపకుండా వరంగల్ పోలీసులు కస్టడీలోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేస్తూ, గ్రామాలలో కూంబింగ్ నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇది అప్రజాస్వామికమైన చర్య అని, గత 30 ఏండ్ల నుంచి ఆదివాసీ, గిరిజన, గిరిజనేతర ప్రజలకు నాయకత్వం వహిస్తూ వారి అభ్యున్నతి కోసం, ప్రధానంగా పోడు భూముల సాధన కోసం, తునికాకు రేట్ల పెంపుదలకోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నారని చెప్పారు. ఎలాంటి తప్పుడు కేసులు బనాయించకుండా విడుదల చేయాలని, పోలీసులు చేస్తున్న కూంబింగ్‌ను ఆపాలని కోరారు.

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, భవాని నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

ముంపు సమస్య లేకుండా చూడండి

- ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 19 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముంపు సమస్య పునరావృత్తం కాకుండా చూడాలని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, భవానీ నగర్‌లో పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలాపూర్ చౌరస్తాలో ఓ ప్రైవేట్ దవాఖానను ప్రారంభించారు. వర్షాకాలంలో కాలనీలలో వరద నీరు నిల్వకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ముంపు కాలనీల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. నాలా పనులు పూర్తి చేయకుండా వదిలేసిన వాటిని పూర్తిచేయించాలన్నారు. చెరువు పరిసరాలలో ఉన్న కాలనీలకు వర్షం నీరు రాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని, వరద కాల్వలకు అడ్డుగా ఉన్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముంపు కాలనీలలో అధికారులు పర్యటించి సమస్యలను తెలుసుకొని త్వరగా పరిష్కరించాలని, ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, బడంగ్‌పేట అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దీప్‌లాల్ చౌహన్, కాలనీ వాసులు వెంకటేశ్వర్లు, ఫిరాజ్, విజయసింహా రెడ్డి, పూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కావచ్చిన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

ఆనందంగా ఉందంటూ కేటీఆర్ ట్వీట్

KTR @KTRBRS · 9h
Had initiated a pilot MLCP (Multilevel Car Parking) project in a PPP mode near Nampally Metro Station back in 2016/17

Despite some teething problems and a bit of time delay, glad it's finally shaped up well

Hope the Congress Govt will take this forward and add many more of
Show more

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చేపట్టిన అత్యాధునిక మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు పనులు చివరి దశకు చేరుకున్నాయి. నాంపల్లి మెట్రో స్టేషన్, గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌ల మధ్య విశాలమైన స్థలంలో నిర్మిస్తున్న మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోర్ సిటీలో ఎంతో కీలకమైన నాంపల్లిలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అలాంటి వారు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి చక్కని పరిష్కారం చూపుతూ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో రూ.80 కోట్లతో నిర్మాణం చేపట్టింది. పూర్తి కావచ్చిన పనులను హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి ఇటీవలే పర్యవేక్షించారు. ఈ మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు ప్రారంభమైతే పార్కింగ్ స్థలంలో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

మొట్ట మొదటి పీపీపీ ప్రాజెక్టు అంటూ కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ నగరంలో పార్కింగ్ సమస్యలను దూరం చేసేందుకు 2016-2017 సంవత్సరంలో మొట్ట మొదటి సారిగా పీపీపీ విధానంలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. నిర్మాణ సమయంలో చిన్న అవాంతరాలు రావడంతో ప్రాజెక్టు అనుకున్న సమయంలో పూర్తి కాలేదని, చివరకు చక్కగా నిర్మాణం పూర్తయినందుకు చాలా ఆనందంగా ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ముందుకు తీసుకువెళ్తుందని, మేము అనుకుంటున్నట్లుగా కీలకమైన జంక్షన్లు, మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాలతో ఇది అనుసంధానం కావడం వల్ల పార్కింగ్ సమస్య తగ్గుందని కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఏఐ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు

రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేలా టీ హబ్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, ఔత్సాహికులు ఏఐపై ఎక్కువగా దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ఆదివారం టీ హబ్‌లో జరిగిన మ్యాథడేమియా-2024 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగంలో ఇక నుంచి ఎక్కువ భవిష్యత్తు, ఉజ్వల అవకాశాలు ఉన్న టెక్నాలజీల్లో ఏఐ, ఎంఎల్ (మెషిన్ లర్నింగ్)లు కీలకంగా మారనున్నాయని తెలిపారు. ఏఐ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు చేసేందుకు విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఏఐ, ఎంఎల్ టెక్నాలజీలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి టీ హబ్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), ఏఐ, ఎంఎల్ టెక్నాలజీ హబ్ మ్యాథ్‌లతో కలిసి సంయుక్తంగా మ్యాథడేమియా-2024ను నిర్వహించారన్నారు. టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మ్యాథడేమియా - 2024 ద్వారా 50కిపైగా యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఏఐ, ఎంఎల్ టెక్నాలజీలో సరికొత్త ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాథ్ సంస్థ సీఈఓ రాహుల్ పైత్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ఓఎస్‌డీ రమాదేవి లంక, పద్మశ్రీ అవార్డు గ్రహీత, టీహబ్ వ్యవస్థాపక సభ్యులు బీవీఆర్ మోహన్ రెడ్డి, డీఎస్‌టీ సైంటిస్టు శార్దూల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు వాడకం తగ్గింది

రెయిన్ ఎఫెక్ట్..!

మేలో హెచ్చుతగ్గులు

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ):గ్రేటర్ హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. ఈ ఏడాది వేసవి సీజన్ ప్రారంభమైన మార్చి నెల నుంచి పెరుగుతూ వచ్చిన విద్యుత్ డిమాండు మే 15 నుంచే ఒక్కసారి తగ్గుముఖం పట్టింది. ఈనెల 4న రోజు వారీ విద్యుత్ వినియోగం 90.68 మిలియన్ యూనిట్లు ఉంటే, మే 6న ఫీక్ అవర్ డిమాండ్ 4352 మెగావాట్లుగా నమోదైంది. సరిగ్గా 11 రోజుల తర్వాత నుంచి విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గుతూ వస్తూనే ఉంది. తాజాగా శనివారం మే 18న ఒక రోజు విద్యుత్ వినియోగం 65.63 మిలియన్లకు తగ్గిపోగా, పీక్ అవర్ డిమాండ్ 3069 మెగావాట్లుగా ఉంది. ఆదివారం సైతం నగరంలో ఉదయం నుంచి వాతావరణం చల్లబడి ఉండటం, మధ్యాహ్నం నుంచే పలు చోట్ల వర్షాలు కురవడంతో ఫీక్ అవర్ డిమాండ్ 3000 మెగావాట్ల వరకు, రోజు వారీ విద్యుత్ వాడకం 61 మిలియన్ యూనిట్లు ఉంటుందని, భారీ వర్షాల నేపథ్యంలోనే విద్యుత్ డిమాండ్ తగ్గిపోయిందని అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణ శాఖ సూచించిన మేరకు మరి కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మేలో విద్యుత్ వినియోగం హెచ్చు తగ్గులతో నమోదవుతోంది. ఇక ఈ వేసవి సీజన్ ముగిసేనాటికి విద్యుత్ డిమాండ్ మే 4న నమోదైన దాని కంటే పెరిగే అవకాశం లేకపోవచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు. కాగా, గతేడాది (2023)మేలో అత్యధిక పీక్ అవర్ డిమాండ్ 3756 మెగావాట్లు, వినియోగం 79.33 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

ఈనెల 15 నుంచి గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్, వినియోగం ఇలా...

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
15	3564	75.36
16	3530	71.44
17	3251	67.34
18	3069	65.63
19	3000	61(అంచనా)

ఎమ్మెల్యేలు, మంత్రులను గ్రామాల్లో తిరుగనివ్వం

- బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- సమగ్ర కులగణన చేపట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, మే 19 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 40 బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఆర్.కృష్ణయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమగ్ర బీసీ కులగణన చేపట్టి చట్ట సభలో బీసీ రిజర్వేషన్లను ప్రవేశపెడుతామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని, పెంచిన తర్వాతనే ఎన్నికలను నిర్వహించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపిందని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సమగ్ర కులగణన చేపట్టాలని లేనిపక్షంలో ఎమ్మెల్యేలు, మంత్రులను గ్రామాల్లో తిరుగనివ్వమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు సి.రాజేందర్, శ్రీనివాస్, అనంతయ్య, పర్వతాలు, కృష్ణమూర్తి, మహిళా బీసీ నేతలు భాగ్యలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో నిష్పక్షమైన విమర్శ కొనసాగాలి



పరిషత్తులో సాహిత్య విమర్శ అధ్యయన శిబిరంలో పాల్గొన్న సాహితీవేత్తలను సత్కరిస్తున్న ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య

తెలుగు యూనివర్సిటీ, మే 19 : తెలుగు సాహిత్య విమర్శలో నిష్పక్షమైన విశ్లేషణ జరగాలని పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం సాహిత్య విమర్శ అధ్యయన శిబిరం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామారావు ప్రధాన ప్రసంగంలో 1875లో వెలువడిన కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన విగ్రహ తంత్ర విమర్శనము మొట్టమొదటి గ్రంథంగా పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు పలు విమర్శగ్రంథాలు, విమర్శకుల గురించి ఆయన తన ప్రసంగంలో వివరించారు. ప్రాచీన సాహిత్య విమర్శ అనే అంశంపై ఆచార్య మాసన చెన్నప్ప ప్రసంగిస్తూ ప్రాచీన సాహిత్యంలో విమర్శ పలు రూపాలలో ఉందని వివరించారు. విమర్శ, వ్యాఖ్యానం, సమీక్ష, సాహిత్య చరిత్ర, పరిశోధనల మధ్య భేదసాదృశ్యాలపై డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి ప్రసంగించారు. విమర్శ ధోరణులు అంశంపై డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, ఆధునిక సాహిత్య విమర్శ వికాసం అంశంపై డాక్టర్ వి.త్రివేణి ప్రసంగించారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో ప్రాచీన కాలం నుంచి తెలుగు భాష, సాహిత్య పరిణామ వికాసాల్లో సాహిత్య విమర్శ ఎంతో ప్రాధాన్యం వహించిందని అన్నారు. ఈ సభలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.

పిల్లల కంటి క్యాన్సర్‌పై అవగాహన

వైటథాన్ రన్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ వినీత్

కొండాపూర్, మే 19 : పిల్లల్లో వచ్చే కంటి క్యాన్సర్ (రెటినోబ్లాస్టోమా)పై అవగాహన కల్పించేందుకు ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్ రన్' 6వ ఎడిషన్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్ జీ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ని ప్రారంభించారు. వైటథాన్ రన్ ద్వారా సమీకరించిన నిధులను రెటినోబ్లాస్టోమాతో బాధపడుతున్న పేద పిల్లల వైద్యానికి వినియోగిస్తున్నారు. ఈ రన్‌లో 2వేలకు పైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. పిల్లల్లో వచ్చే కంటి క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు ఇలాంటి రన్‌లను నిర్వహించడం అభినందనీయమని డీసీపీ వినీత్ అన్నారు. రెటినోబ్లాస్టోమా వ్యాధిపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. పేద పిల్లల వైద్యానికి ప్రైవేట్ దవాఖానలు సైతం సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని తెలిపారు.

తెలుగు సాహిత్యంపై యువతలో ఆసక్తిని పెంచాలి

నీహారిణికి అపురూప పురస్కారం అందజేసి సత్కరిస్తున్న నిర్వాహకులు

తెలుగు యూనివర్సిటీ, మే 19 : తెలుగు సాహిత్యం, లలిత కళల పట్ల యువతలో ఆసక్తిని పెంచాలని పలువురు సాహితీవేత్తలు ఆకాంక్షించారు. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం వివిధ రంగాలలో నిష్ణాతులైన స్త్రీమూర్తులకు అమృతలత-అపురూప అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డుగ్రహీతల పరిచయాలతో కూడిన అభినందన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 2024 సంవత్సరానికిగాను అమృతలత జీవన సాఫల్య పురస్కారాన్ని సాహిత్యం విభాగంలో డాక్టర్ కేవీ కృష్ణకుమారి, వైద్య రంగంలో డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి ప్రదానం చేసి ఒక్కొక్కరికి 25వేల రూపాయల చెక్కులను అందజేసి సత్కరించారు. అపురూప పురస్కారాలను జీఎస్.లక్ష్మి(కథ రచన), ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ(సాహితీ విమర్శ), శివలక్ష్మి(సినీ విశ్లేషణ), సావేరి దుర్గాభవాని(నాటకరంగం), ప్రొఫెసర్ సమతా రోష్ని(సామాజిక సేవ), నండూరి సుందరీ నాగమణి(పద్యరచన), డాక్టర్ కొండపల్లి నీహారిణి(అంతర్జాల పత్రిక సంపాదకత్వం), జ్యోతిర్మయి మళ్ళ(సంగీతం-గజల్), అంజనీ యలమంచిలి(షార్ట్ ఫిలిం), గీతాహజారే(నృత్యం), ప్రేమమాలిని(జర్నలిజం-ఎలక్ట్రానిక్ మీడియా), దేవనపల్లి వీణావాణి(కవిత్వం) ప్రక్రియలకు గాను ఒక్కొక్కరికి 10వేల రూపాయలు అందజేసి సత్కరించారు. పురస్కారాల ప్రదాత డాక్టర్ అమృతలత, కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి, దూరదర్శన్ విశ్రాంత సంచాలకులు డాక్టర్ ఓలేటి పార్వతీశం, తెలుగువర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, సినీనటి తులసి పాల్గొని పురస్కారగ్రహీతల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారులు మెడ్లీ, ధారిణి, శిల్ప శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.

అరుదైన బ్లడ్ గ్రూప్‌పై అవగాహన సదస్సు

ఖైరతాబాద్, మే 19 : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనోహెమటాలజీ, నిమ్స్ ఇమ్యూనోహెమటాలజీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ విభాగాల సంయుక్తాధ్వర్యంలో నిమ్స్ ఆడిటోరియంలో అరుదైన బ్లడ్ గ్రూప్‌లపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో అరుదైన బ్లడ్ గ్రూప్ వల్ల ఎందరో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రేర్ బ్లడ్ గ్రూప్ కలిగిన వారు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం బాంబే బ్లడ్ గ్రూప్ దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, ఐసీఎంఆర్ ప్రతినిధి డాక్టర్ స్వాతి, నిమ్స్ బ్లడ్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ బి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప